• ఇండియాటుడే. మే 13, 2003.

# చిలకాకుపచ్చ రంగు జరీచీర

"ఏవండోయ్! పొద్దున్నే మీకో సంతోషం కలిగించే వార్త." అనంతలక్ష్మి మాటలకి బాత్రూంలోంచి వస్తున్న వాసుదేవరావు ఆమెవైపు అనుమానంగా చూశాడు.

"నా పుట్టిన్రోజుకి మీరు మూడువేలు పెట్టి జరీ చీర కొనక్కరలేదు" అందామె.

"ఎంచేతో? ఆ రోజు నుంచీ నువ్వు చీరలు కట్టడం మానేద్దామని డిసైడ్ చేసుకున్నావేమిటి?" అడిగేడు.

"ఆశ. అదేం కాదు– చీర కొనక్కరలేదని కాదు– అంత ధర పెట్టి కొనక్కరలేదని నా ఉద్దేశం. చీర ధర తగ్గి, ఖర్చు తగ్గితే మీకు సంతోషం కాదూ?

"ఎలాగో? ఆ పజిల్ కాస్తా విప్పరాదూ!" ఆసక్తిగా చూసేడు వాసుదేవరావు.

"ఎలాగో ఏమిటో ఈ 'దినదిన గండం' ఆరో పేజీ చూడండి" అంటూ చేతిలోని చిన్న పేపరు తీసి అతనికందించింది అనంతలక్ష్మి. దినపత్రికతో పాటు ఇచ్చే సిటీ ఎడిషన్‌కి వాళ్ళు పెట్టుకున్న ముద్దుపేరు దినదినగండం దాన్ని చూడాలంటేనే వాసుదేవరావుకీ భయం.

దొంగతనాలు, హత్యలూ, మానభంగాలూ నగరంలో ఏయే ప్రాంతాల్లో జరిగాయో వివరంగా, కథలు కథలుగా ఉంటుందందులో. అవికాక ఇంటి పన్నులూ, నీటి పన్నులూ, కరెంట్ చార్జీలూ ఏ క్షణంలో ఎంతెంత పెరిగాయో, పెరుగుతాయో వివరాలుండొచ్చు.

రోడ్డు ప్రమాదాలు, రక్తపు మడుగుల్లో ఉన్న, ఉరేసుకున్న మనుషుల కలర్ ఫోటోలూ, ప్రజల బలహీనతల ఆధారంగా చేసుకుని వెలువడే మోసపూరిత వ్యాపార ప్రకటనలూ! అందుకే ఆ చిన్న పేపరంటే అతగాడికంత భయం.

కాఫీ తాగుతూ ఆరో పేజీ తీసి ఎర్ర పెన్‌తో మార్క్ చేసిన ఆ ప్రకటన వంక చూశాడు. "పట్టు జరీ చీరల ప్రదర్శన. మీ యొక్క పాత పట్టు జరీచీరలు పట్టుకురండి. మా యొక్క గొప్ప ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ వినియోగించుకుని కొత్త చీరలు పట్టుకుపొండి. ఈ పేపరు కటింగ్ తెచ్చినవారికి అదనంగా అయిదొందల రూపాయలు తగ్గింపు కూడా ఉంటుంది."

"అంటే నీ పాత చీరలు ఇచ్చేద్దామనా!" అడిగేడు వాసుదేవరావు. అవునన్నట్లు తలూపింది అనంతలక్ష్మి.

"మరి ఇచ్చేసేంత పాత చీరలు నీ దగ్గర ఎక్కడివీ?

"ఉన్నవే. పదేళ్ళ నించీ వాడుతున్నవి. కొత్త చీర ఎలాగూ కొంటానన్నారుగా. వీటిలో కొన్ని ఎక్స్‌ఛేంజ్ చేసేస్తే మీక్కొంత ఖర్చు తగ్గుతుంది. అవునా" అంటూ బీరువాలో అడుగు అరలో పెట్టేసిన నాలుగు పాత చీరలు తెచ్చి ముందుంచి, "ఇది మన పెళ్లికి మూడు నిద్రలకి కొన్న జరీ అంచున్న తెల్ల చీర. ఇది పెద్దాడి బాలసారెకి మీరు మెద్రాస్ నించి తెచ్చింది. ఇది మన పెళ్ళయిన మూడో సంవత్సరంలో బెనారస్ వెళ్ళినప్పుడు అక్కడ కొన్నది. మరి ఇది బాగానే ఉంది గానీ ఇచ్చేద్దామనుకుంటున్నాను. రెండోదాని అన్నప్రాశనకు మా అమ్మతెచ్చింది" అంటూ ఒక్కొక్క చీర తీసి చూపించింది.

"ఇలా నువ్వు కట్టని చీరలు బీరువాలో ఎన్ని ఉంటాయంటావ్!"

"కట్టకపోవడమేంటి? కట్టుకున్నప్పుడు మీరు చూసి ఉండరు. అయినా, ఈ పాత చీరలే ఇంకా చిరగలేదని కట్టుకుంటూ ఉంటే కొత్తవెప్పుడు కొనుక్కోడం?"

వాసుదేవరావు ఒక్క క్షణం ఊరుకొని, "వాళ్లు ఒకపక్క ఉన్న చీరలు లాగేసుకుంటూ, మరోపక్క చీరలిస్తూంటే నాకేదో పౌరాణిక నాటకంలోని సీను గుర్తొస్తోంది సుమా" అన్నాడు.

"మీకలాంటి సీన్లే గుర్తొస్తాయిలెండి! మీ సుళువు కోసమే చెబుతున్నాను. మీరొక రెండువేలు పెడితే సరిపోతుందనుకుంటున్నాను. ఇలాంటి ఆఫరు ఎప్పుడోగాని ఉండదు. మరో మూడు రోజులే ఈ అవకాశం. ఎప్పుడు వెళ్దామో చెప్పండి" అంది అనంతలక్ష్మి తాపీగా.

"వెళ్లడం తప్పనప్పుడు ఎప్పుడైతేనేం? ఎల్లుండే వెళ్దాం" అన్నాడు వాసుదేవరావు.

"ఎల్లుండైతే అన్నీ ఎంపుడైపోతాయి. రేపైతే మన పిల్లలు ఊర్నించి వస్తున్నారు. అంచేత ఇవాళే వెళ్దాం. మీరు ఆఫీసు నుంచి ఓ అరగంట ముందు రండి." అంది.

"బాగానే ఉంది. అది ఆఫీసా. అల్లిపురం సంతలోని దుకాణమా కట్టేసుకురావడానికి?"

"ఏదో ఒకటి! రండి."

◆ ❖ ◆

అది స్టార్ హోటల్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఏ.సి.హాలు. చల్లగా ఉంది లోపల. ఎన్నెన్నో రంగుల పట్టు జరీ చీరలు అందంగా అలంకరింపబడి ఉన్నాయి.

"ఈమారు చిలకాకుపచ్చరంగు జరీ చీర తీసుకుంటానండీ. ఎప్పట్నించో ఆ రంగు మీద మనసుండిపోయింది. చిన్నప్పుడెప్పుడో ఆ రంగు పట్టు పరికిణీ కట్టేను. అంతే. ఇప్పటివరకూ మళ్లీ జత పళ్ళేదు ఆ రంగు. ఇంతకీ నాకా రంగు బావుంటుందంటారా!" అడిగింది అనంతలక్ష్మి భర్త వంక చూస్తూ.

"ఇష్టపడే చీర వేరు, నప్పే చీర వేరు. రెండూ ఒకటైతే అదృష్టమే. ఆ రంగు చీర నువ్వు కట్టుకుంటే చిలకలా ఉంటావు" అన్నాడు వాసుదేవరావు.

"ఎలా ఉంటానని కాదు నేనడిగింది. నాకు బాగుంటుందా అని."

"కట్టుకున్నాకే గదా తెలిసేది అసలు రంగు. నిన్ను కట్టుకున్నాకే గదా నీ గురించి నాకు తెలిసింది" అన్నాడు ఎటో చూస్తూ.

అన్ని రకాల చీరలూ చూపిస్తున్నాడు సేల్స్‌మెన్. "పోనీ ఈ చీరెలా ఉందో చెప్పండి. బోర్డరు కాస్త పెద్దదిగా లేదూ." అడిగింది.

"కట్టుకుంటే బావుంటుందమ్మా. అందరి కళ్ళూ మీ మీదే ఉంటాయి" అన్నాడు సేల్స్‌మన్ కల్పించుకుని.

"ఏం లేకపోయినా మావాళ్ళందరి కళ్ళూ ఇప్పటికే నా మీద ఉన్నాయి నాయనా" అని అతగాడితో చెప్పి, "ఏవండీ, చెప్పరేం" అంది వాసుదేవరావుతో.

'అంచు పెద్దదయినా బాగానే ఉంది. జరీ అంచు కదా రేపెప్పుడన్నా ఇలాగే ఎక్స్ఛేంజ్ చేసుకోవాలంటే రేటు మరో పది ఎక్కువొస్తుంది" అన్నాడు వాసుదేవరావు సీరియస్‌గా.

"పోనీ ఇది చూడండి. బొత్తిగా బెత్తెడంత అంచే అయినా అందంగా లేదూ!" అంటూ ఇంకో గడిచీర చూపించింది.

"అందమన్నది మనిషిలో ఉండాలి గానీ నిజంగా అటువంటివారు ఏది కట్టుకున్నా అందంగానే ఉంటుంది."

"అయితే, మీ దృష్టిలో నేను అందంగా ఉన్నట్టా లేనట్టా?"

వాళ్ళిద్దరి సంభాషణా ఎటు దారితీస్తుందో సేల్స్‌మెన్‌కి అర్థం కావటం లేదు.

"ఇది చూడండమ్మా. సరికొత్త డిజైన్. ఈ మధ్య వచ్చిన 'నీకే నీకే' సినిమా కోసం కొత్తగా ఆర్డరిచ్చి నేయించారు" అంటూ మరో చీర చూపించేడు.

"సర్లే. ఆ సినిమాలో హీరోయిన్ చీరలెక్కడ కట్టింది? సినిమా చివరి వరకూ ఆ పిల్లకి నిక్కరూ, బనీనేగా! వాళ్ళమ్మ కట్టిందేమో మరి" అన్నాడు వాసుదేవరావు.

"కాదండి. ఆఖర్న పెళ్ళయినాక హీరో చీర తెచ్చి 'ఈ అందమైన చీర నీకే నీకే' అంటాడు గదండీ" అన్నాడు సేల్స్‌మెన్.

"అలా చెప్పు. అయినా అదొద్దులే. చిలకాకుపచ్చ రంగు– మీడియం జరీ అంచున్న చీర చూపించు" అంది ఓ డజను చీరలు బయటకు లాగి, చివరకు ఓ చీర చూపించేడు. దాన్ని చూసేసరికి అనంతలక్ష్మి కళ్ళు మెరిశాయి.

"ఈ చీర బాగుందండీ. రంగూ, అంచూ బాగున్నాయి తీస్కోనా? అని, "ఈ చీర ఎంతయ్యా" అనడిగింది సేల్స్‌మన్‌ని.

"అయిదు వేల ఏడొందలు" అన్నాడతడు.

"అది కట్టుకుంటే చీర విలువ ఎక్కువా, మనిషి విలువ తక్కువా అవుతుందేమో చూడు అన్నాడు వాసుదేవరావు. సీలింగ్ వంక చూస్తూ–

"నన్ను మీరెప్పుడు సరిగ్గా అంచనా వేశారు కనుక" అని, కాస్త దూరంగా జరిగి, "నా పాత చీరలు నాలుగూ ఎలా లేదన్నా పన్నెండు వందల విలువ చేయకపోవు. దానికి తోడు ఈ కటింగ్స్ నాలుగున్నాయి. మీరో రెండు వేల చిల్లర వేస్తే సరిపోతుందేమో" అంటూ తన బ్యాగ్‌లోంచి నాలుగు పేపర్ కటింగ్స్ తీసింది అనంతలక్ష్మి.

"ఇవెందుకూ!" ఆశ్చర్యంగా అడిగేడు వాసుదేవరావు.

"పేపరు కటింగ్ తెస్తే అయిదొందలు డిస్కౌంట్ అన్నాడు కదా."

"మరీ బావుంది. అయినా ఇన్ని కటింగులెక్కడివీ. మనకున్న పేపరు ఒక్కటేగదా."

"మధ్యాహ్నం మా తమ్ముడికి ఫోన్ చేశాను. వాడు మూడు సంపాదించి తెచ్చేడు" అంది అనంతలక్ష్మి విజయగర్వంతో. వాసుదేవరావుకి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు.

"ఇంకా నయం. కౌంటర్లో ఇచ్చేవు కాదు. పరువు పోను. పేపర్ కటింగులకే వాడు ధరలు కట్టి చీరలిచ్చేస్తే ఆ పాత చీరలు కూడా ఎందుకూ? మరో అయిదో ఆరో అవే సంపాదించి తెస్తే సరిపోయేది గదా" అన్నాడు.

"అవును సుమండీ" అనబోయిన అనంతలక్ష్మి బుర్రలో అప్పుడే జీరోవాల్టు బల్బు వెలిగింది!

వీళ్ళ సంభాషణ వినబడని సేల్స్‌మన్‌కి మాత్రం వాళ్ళు చీర ధర గురించి తర్జన భర్జన పడుతున్నట్టు అర్థమైంది.

"మీ చీరల వేల్యూ అయిదొందలూ, పేపర్ కట్టింగ్ డిస్కౌంట్ అయిదొందలూ అందులోంచి తీసేస్తే సరిపోతుందమ్మా" అన్నాడు. తాను తెచ్చిన చీరలకు అంత తక్కువ ధర కడతాడని ఊహించని అనంతలక్ష్మి ఆశ్చర్యపోయింది.

"ఆ చీరలు కొన్నప్పుడు ఒక్కొక్కటీ ఎంతో తెల్సా అని వాసుదేవరావు వంక తిరిగి, "పట్టుమని పదిసార్లు కూడా కట్టి ఉండను" అంది.

"నువ్వెన్నిసార్లు కట్టుకుంటే అతనికెందుకూ? వాళ్ళేం మళ్ళీ ఇది కట్టుకుంటారా ఏమన్నానా? పాతవి తీసేసుకుంటేగాని కొత్తవి కొనుక్కోరని ఈ స్కీము పెట్టి ఉంటారు" అన్నాడు వాసుదేవరావు రహస్యంగా ఆమె చెవిలో.

"అయిదు వేల రూపాయల చీరలొద్దుగానీ కొంచెం తక్కువ ధరల్లో చూపించండి" అంది అనంతలక్ష్మి సేల్స్‌మన్ వంక తిరిగి.

అతగాడు రెండు వేల రూపాయల చీరల దగ్గర్నుంచీ చూపించడం మొదలుపెట్టేడు. తక్కువ ధరల్లో చిలకాకు పచ్చరంగు చీరల్లేవు. ఆ రంగు ఉన్న కొన్ని చీరలకి జరీ అంచుల్లేవు. మొత్తానికెలాగో నాలుగు వేల రూపాయల ధరలో తనకు నచ్చిన చిలకాకు పచ్చరంగు జరీ చీర దొరికింది. పేపరు కటింగ్ తాలూకు డిస్కౌంటూ, పాత చీరల తాలూకు సొమ్మూ మినహాయించగా రెండు వేల·ఏడు వందలకి బేరం కుదిరింది.

"చూశారా. మీకు మూడొందలు మిగిల్చాను." అంది అనంతలక్ష్మి బయటికొస్తూ. వాసుదేవరావేం మాట్లాడలేదు.

◆ ❖ ◆

ఉదయం ఏడు గంటలకు వీధిలో చప్పుడైతే వెళ్ళి తలుపు తీసింది అనంతలక్ష్మి. సెలవులకి తాతగారి ఊరు వెళ్లిన పిల్లలిద్దరూ బిలబిల్లాడుతూ లోపలికి వచ్చేశారు.

"మీరిద్దరే వచ్చేశారేమిట్రా" అని అడిగింది ఆశ్చర్యంగా వాళ్ళ వంక చూసి.

"అదిగో" అంటూ వీధిలోకి చెయ్యి చూపించారు వాళ్ళు. వీధిలో అనంతలక్ష్మి తల్లి ఆటో అతనితో తగాదా పడుతోంది.

"ఎక్కేటప్పుడు పోలీసాయన ముందు మీటరుందా అంటే తలూపేవు గదయ్యా" అంటోందావిడ.

"అంతా అప్పు గదమ్మా. కష్టం చూడాలి" అంటున్నాడు అతగాడు.

"ఆటో డ్రైవరుకి అప్పేమిటి? కష్టమేమిటి?" అంటోందావిడ.

"అప్పులూ, కష్టాలూ అందరికీ ఉంటాయిగాని అతగాడు అడిగింది ఇచ్చేసి రమ్మను మీ అమ్మని" అన్నాడు వాసుదేవరావు అక్కడికొచ్చి.

"ఎందుకు గొడవ, ఇచ్చేయమ్మా. సముద్రపు టొడ్డు కదా ఈ ఊళ్ళో మీటర్లు తిరగవులే" అంది అనంతలక్ష్మి.

స్నానాలూ, కాఫీలూ అయ్యాక ముందు హాల్లో కొచ్చారు అనంతలక్ష్మీ, ఆమె తల్లీ. వాసుదేవరావు న్యూస్‌పేపరు చదువుకుంటున్నాడు. పిల్లలిద్దరూ పక్కింటి నేస్తాల కోసం పరుగులెత్తారు.

"ఎలాగూ నీ పుట్టిన్రోజు దగ్గరకొచ్చింది కదా. మీ నాన్నగారు కూడా వద్దామనే అనుకున్నారు. కానీ రిటైర్మెంట్ సొమ్మేదో ఇవాళో, రేపో అందాల్సిఉందట. ఆ సొమ్ము ఏ బ్యాంకులో వేద్దామా అని వాకబు చేస్తున్నారు" అంది అనంతలక్ష్మి తల్లి. అల్లుడు కూడా వినాలన్నట్లుగా.

అన్ని బ్యాంకులూ వడ్డీ రేట్లు తగ్గించేశాయమ్మా. దాచుకోవడం కన్నా ప్రజలకు అప్పులు చేయడం నేర్పిస్తున్నారు" అంటూ భర్త వంక చూసి, "కదండీ" అంది అనంతలక్ష్మి.

"మరేం స్వయంకృషి బ్యాంకని కొత్తగా పెడుతున్నారట. డిపాజిట్ల మీద వడ్డీ ఎక్కువే ఇస్తారట. మావగారెటూ స్వయంకృషితోనే పైకొచ్చినవారు కాబట్టి..." వాసుదేవరావు మాటలు పూర్తి కాకుండానే తుళ్ళిపడ్డారు అనంతలక్ష్మి, ఆమె తల్లి.

"ఇంకా నయం. అంతకంటే స్వయంగా గొయ్యి తవ్వుకోవడం ఉత్తమం" అంది అనంతలక్ష్మి సీరియస్‌గా ముఖం పెట్టి.

"అల్లుడుగారు హాస్యానికన్నారులేవే" అని, "అన్నట్టు చెప్పడం మరచాను. నీ పుట్టినరోజుకి నీకు చీర పంపించారు మీ నాన్నగారు" అంటూ బ్యాగ్‌లోంచి న్యూస్ పేపర్ చుట్టిన కవర్ని తీసి అందించింది అనంతలక్ష్మి తల్లి.

"ఇప్పుడెందుకమ్మా ఇది" అంటూ దాన్ని తీసుకోకుండానే వాసుదేవరావు వంక గర్వంగా చూసింది అనంతలక్ష్మి.

"పుట్టింటినించొచ్చిన పుట్టిన్రోజు చీర కాదనకూడదు. విప్పి చూడు" అన్నాడతను.

"ఎక్కడ ఉన్నా మా పిల్లవే గదే. మా సంతృప్తి మాది" అంది అనంతలక్ష్మి తల్లి. కవరు అందుకుని చీర బయటకు తీసి చూసిన అనంతలక్ష్మి ఆశ్చర్యంలో ఉండిపోయింది.

అందులో ఆమెకు నచ్చిన చిలకాకు పచ్చరంగు చీర, వెండి జరీతో మెరిసిపోతూ, తప్పిపోయి తిరిగొచ్చిన కవల పిల్లలా ఉంది.

"కొత్తగా షాపు పెట్టి స్వయంగా మగ్గాల నుంచి తెచ్చి, డిస్కౌంటు ఇచ్చి మరీ అమ్ముతుంటేనూ..." అంటోంది అనంతలక్ష్మి తల్లి.

అంచు కిందనున్న స్లిప్ మీద ధర చూసి గతుక్కుమంది అనంతలక్ష్మి. అచ్చంగా రెండు వేలు!

◆ ❖ ◆